సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం, 1, జనవరి, 2024



వైభవంగా విశేష పూజలు

విశాఖ: నగరంలోని కనకమహాలక్ష్మి అమ్మ వారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉభయదాతలు పాల్గొన్నారు.



శ్రీకృష్ణుడిగా అప్పన్న

సింహగిరిపై రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శ్రీకృష్ణుడి అలంకరణలో దర్శనమిచ్చారు.

ఘనంగా లక్ష పుష్పార్చన



విశాఖ: అక్కిరెడ్డి పాలెంలోని ప్రసన్న వేంకటేశ్వ రునికి 108 మంది మహిళలు లక్ష చామంతుల పుష్పార్చన నిర్వహించారు.

న్యూస్‌రీల్

ప్రగతి మార్గంలో సాగుదాం

సాక్షి, పాడేరు: జిల్లా ప్రజలకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకు, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రగతి మార్గంలో సాగుదామని వారు ఆకాంక్షించారు.

వైద్య కళాశాలలో ఉద్యోగాలకు దరఖాస్తుల వెల్లువ

- 256 పోస్టులకు 11,705 స్వీకరణ



అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలిస్తున్న బోధన ఆస్పత్రి సిబ్బంది

సాక్షి,పాడేరు: స్థానిక వైద్య కళాశాల, జనరల్ ఆస్పత్రిలో భర్తీ చేయనున్న పోస్టులకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. 256 పోస్టులకు 11,705 దరఖాస్తులు వచ్చినట్టు అధికారవర్గాలు తెలిపాయి. వీటిని బోధన ఆస్పత్రిలో సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. త్వరలో అభ్యర్థుల జాబితాను కలెక్టర్ సుమిత్‌కుమార్ అందజేస్తామని పాడేరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి తెలిపారు. ప్రభుత్వ మార్గనిర్దేశాల ప్రకారం కలెక్టర్ ఆధ్వర్యంలో భర్తీ ప్రక్రియ జరుగుతుందన్నారు.

'చాపరాయి' రెండు రోజులు మూసివేత

డుంబ్రిగుడ: చాపరాయి జలపాతాన్ని జనవరి 2,3 తేదీల్లో మూసివేస్తున్నట్టు పాడేరు ఐటీడీఏ పర్యాటక మేనేజర్ మురళి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జలపాతం పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, మరమ్మతుల నిమిత్తం పర్యాటకుల ప్రవేశం నిలిపివేస్తున్నామని చెప్పారు. పర్యాటకులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రెండు పూరిళ్లు దగ్ధం



బూడిదైన పూరిళ్లు

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ గ్రామ సచివాలయం పరిధిలోని చీడిపాకలు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. సుమారు రూ. 3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన కోండ్ల రేకమ్మ, వెలుగూరి పండయ్యకు చెందిన ఇళ్లు ప్రమాదానికి గురయ్యారు. సర్వం బూడిద అవడంతో నిరాశ్రయులయ్యారు. పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న సమయంలో ప్రమాదం సంభవించినట్టు బాధితులు తెలిపారు. సర్పంచ్ పల్లాల పద్మావతి సంఘటన స్థలానికి వెళ్లి బాధితులను ఓదార్చారు. తక్షణ సహాయం అందించారు. బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

మురిసిన పర్యాటకం

- పర్యాటక ప్రాంతాలు కిటకిట
- భారీగా తరలివచ్చిన సందర్శకులు
- రద్దీగా రిసార్టులు, అతిథి గృహాలు
- అర్ధరాత్రి వేడుకలు నిర్వహిస్తూ సందడి

ఒకపక్క న్యూఇయర్.. మరోపక్క వీకెండ్ కావడంతో పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. న్యూఇయర్ నేపథ్యంలో సరదాగా గడిపేందుకు , వేడుకలు నిర్వహించేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా తదితర ప్రాంతాల నుంచి భారీగా సందర్శకులు తరలివచ్చారు. రిసార్టులు, అతిథి గృహాలు, లాడ్జీలు, రిసార్టులు, హోటళ్లు పర్యాటకులతో నిండిపోయాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు.



తాజంగి జలాశయంలో బోటింగ్



బొర్రా గుహల వద్ద జిప్‌లైన్‌పై విహరిస్తున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా అన్ని పర్యాటక ప్రాంతాలు పర్యాటకులతో రెండు రోజుల నుంచి రద్దీగా మారాయి. లంబసింగి,అరకు, అనంతగిరి, వంజంగి ప్రాంతాల్లో కాటేజీలకు పర్యాటకుల నుంచి మంచి డిమాండ్ నెలకొంది. ఆదివారం వేకువజామునుంచి పాడేరు ప్రాంతంలోని వంజంగి హిల్స్‌కు వేల సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు.

డుంబ్రిగుడ: పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతం వద్ద ఆదివారం మైదాన ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చి సందడి చేశారు. కుటుంబ సమేతంగా స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

చింతపల్లి రూరల్: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలైన లంబసింగి, చెరువులవేనం పర్యాటకులతో కిటకిటలాడాయి. ప్రకృతి అందాలను తిలకించి సందడి చేశారు. తాజంగి జలాశయంలో బోటింగ్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతానికి పర్యాటకులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలతోపాటు



వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

ఒడిశా నుంచి భారీగా తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

బొర్రాకు పోటెత్తిన పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలకు ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. గుహలను ఆనుకుని గోస్తనీ నదిపై పర్యాటకశాఖ ఏర్పాటుచేసిన జిప్‌లైన్‌కు పర్యాటకులు తాకిడి పెరిగింది. గోస్తనీ అందాలను తిలకించేందుకు



బొర్రా గుహలకు తరలివచ్చిన సందర్శకులు

ఆసక్తి చూపారు. సరియా, తాటిగుడ, చిట్టంపాడు, కటికి జలపాతాల్లో పర్యాటకులు స్నానాలు చేస్తూ సందడి చేశారు. అరకు-విశాఖ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న డముకు, గాలికొండ వ్యూపాయింట్, కాఫీ ప్లాంటేషన్ పర్యాటకులతో కిక్కిరిశాయి. బొర్రా గుహలను 7,800 తిలకించగా రూ.6లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీశంకర్ తెలిపారు. జిప్‌లైన్‌పై 800 మంది విహరించగా రూ.4 లక్షల సమకూరిందని ఆయన పేర్కొన్నారు.



చాపరాయిలో పర్యాటకులతో సందడి



చెరువులవేనంకు తరలివచ్చిన సందర్శకులు



కొత్తపల్లి జలపాతానికి భారీగా పర్యాటకులు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



తిలకిస్తున్న పర్యాటకులు, స్థానికులు

అరకులోయ రూరల్: స్థానిక గిరిజన మ్యూజియంలో రెండో రోజు ఆదివారం నిర్వహించిన గిరిజన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మత్రి కామయ్య కళావేదికపై నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భారీగా సందర్శకులు



డ్యాన్స్ చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థినులు

తరలివచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. థింసా నృత్యం మైమరిపించింది. పాడేరుకు చెందిన శంకర్ ఈవెంట్ బృందం డ్యాన్సులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



థింసా నృత్యం చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు



నృత్యం చేస్తున్న థింసా కళాకారులు

ఘనంగా నారీ శక్తి సమ్మేళనం



శ్రీరాముని అక్షింతలను ఊరేగిస్తున్న మహిళలు

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం నారీ శక్తి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక వీఆర్ కల్యాణ మండపంలో మహిళా సాధికారితపై పాడేరు స్థానిక వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలతాదేవి సదస్సు నిర్వహించారు. అనంతరం అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలను పాడేరు పురవీధుల్లో ఊరేగించారు. మోదకొండమ్మతల్లి ఆలయంలోను ప్రత్యేక పూజలు జరిపారు. థింసా నృత్యాలతో మహిళలు సందడి చేశారు.

నూతనోత్సాహం



విశాఖ ఎయిర్‌పోర్టు వద్ద న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ..

- నూతన సంవత్సరానికి ఘన స్వాగతం
- జిల్లావ్యాప్తంగా మిన్నంటిన సంబరాలు

సాక్షి, పాడేరు: ఆంగ్ల నూతన సంవత్సరానికి కోటి ఆశలతో జిల్లా ప్రజలు స్వాగతం పలికారు. 2023కు వీడ్కోలు పలికి, కొత్త సంవత్సరంలో అన్నీ శుభాలే జరగాలని ఆశిస్తూ '2024'ను సాదరంగా ఆహ్వానించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి మొదలుకుని సోమవారం తెల్లవారు జాము వరకు జిల్లా అంతటా ఎటుచూసినా న్యూ ఇయర్ సంబరాలు కొనసాగాయి. యువత హడావుడికి అంతు లేకుండా పోయింది. సంబరాలు మిన్నంటాయి. యువతీ, యువకులు రాత్రి 12 గంటలు కాగానే ఒకరికొకరు శుభాకాంక్షలు తెలు



పాడేరులో న్యూ ఇయర్ ముగ్గుల సందడి

పుకున్నారు. జిల్లా కేంద్రమైన పాడేరులో పండ్లు, పూలు, స్వీట్ల దుకాణాల వద్ద సందడి నెలకొంది. ఇళ్ల ముంగిట మహిళలు 'హ్యాపీ న్యూఇయర్'ను రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జిల్లా అంతటా వేడుకల్లో నిమగ్నమయ్యారు.

విశాఖ బీచ్‌లో 2024 సందడి



లంబసింగిలో విస్తృత తనిఖీలు



లంబసింగి జంక్షన్‌లో పోలీసు బందోబస్తు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చింతపల్లి రూరల్: లంబసింగి వచ్చే ప్రతీ వాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. మద్యాన్ని అనుమతించలేదు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ తెలిపారు.

వణికిస్తున్న చలిగాలులు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత నెలకొంది. సాయంత్రం నుంచి వీస్తున్న చలిగాలులకు ప్రజలు వణికిపోతున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి చలి మంటలను ఆశ్రయిస్తున్నారు. పొగమంచు దట్టంగా కురుస్తోంది.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. పాడేరు మండలం మినుములూరు కాఫీ బోర్డు వద్ద 11డిగ్రీలు, అరకులోయ కాఫీ బోర్డు వద్ద 14.4డిగ్రీలు, చింతపల్లిలో 14.5డిగ్రీల కనిష్ట ఉష్ణో



చలిమంటను కాగుతున్న యువకులు

గ్రతలు ఆదివారం నమోదైనట్టు అధికారవర్గాలు తెలిపాయి.

ధర లేక జాఫ్రా రైతు దిగాలు

- ఈ ఏడాది ఆశాజనకంగా దిగుబడి
- అయినా మన్యంలో కిలో రూ.90కే కొనుగోలు
- ఢిల్లీ మార్కెట్లో మాత్రం కిలో రూ.300
- రైతులను దోచుకుంటున్న దళారులు



జాఫ్రా తోట



నిండుగా జాఫ్రా కాయలతో చెట్టు

రంపచోడవరం: అంతర్జాతీయ మార్కెట్‌లో మన్యం జాఫ్రా గింజలు అత్యధిక ధరకు అమ్ముడుపోతున్నా జిల్లాలో సాగు చేసే రైతులకు మాత్రం మంచి ధర లభించడం లేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున జాఫ్రాను విస్తారంగా సాగు చేస్తున్నారు. మారేడుమిల్లి, వై.రామవరం ఎగువ ప్రాంతంలో నాలుగు వేల ఎకరాల్లో పండిస్తున్నారు.

కొండపోడు భూముల్లో..

గిరి రైతులు స్థానిక అవసరాల నిమిత్తం అక్కడక్కడ పొలాల్లో నాటారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు జాఫ్రా గింజలను కొనుగోలు చేయడంతో కొండపోడు భూముల్లో సాగుగా మొదలుపెట్టారు. చెట్ల నుంచి ఎండిన కాయలను సేకరించి అరబెడతారు. ఎండ వేడికి కాయలు పగిలి వాటి లోపల గింజలు బయటకు వస్తాయి. వాటిలో పది శాతం తేమ ఉండగా విక్రయిస్తారు.

నాటిన మూడేళ్లకు..

మొక్క నాటిన మూడేళ్లకు కాపునకు వస్తుంది. మొదటి ఏడాది మూడు నుంచి ఐదు కిలోల వరకు దిగుబడి వస్తుంది. నాలుగో ఏడాది నుంచి ఐదు నుంచి పది కేజీల దిగుబడి వస్తోందని రైతులు తెలిపారు. మొక్కలు నాటిన తరువాత పెద్ద సంరక్షణ చర్యలు అవసరం లేకపోవడంతో ఈ సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఎకరాకు 90 మొక్కలు నాటుకోవచ్చు. జనవరి నుంచి మార్చి మధ్య పంట చేతికొస్తుంది. నేచురల్ ఫుడ్ కలర్, లిప్‌స్టిక్‌లో వినియోగించే జాఫ్రా గింజలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది.

దళారులకే లాభాలు : గిరిజన రైతులు పండిస్తున్న జాఫ్రా పంటతో దళారి వ్యాపారులకే లాభాలు దక్కుతున్నాయి. అడ్వాన్స్ పేరుతో రైతులు వారి నుంచి నగదు తీసుకోవడంతో వారు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. స్థానికంగా కిలో జాఫ్రా గింజలకు రూ.90 ధర చెల్లిస్తుండగా అవే గింజలను ఢిల్లీ మార్కెట్లో రూ.300కు విక్రయించి మంచి ఆదాయం పొందుతున్నారని రైతులు తెలిపారు.

తుని కేంద్రంగా ఢిల్లీకి ఎగుమతి

ఏజెన్సీ ప్రాంతంలో పండిస్తున్న జాఫ్రా గింజలను గోకవరం, కొత్తపల్లి, మారేడుమిల్లికి చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వీరి నుంచి కాకినాడ జిల్లా తుని ప్రాంతానికి చెందిన ఒక వ్యాపారి కొనుగోలు చేసి ఢిల్లీ వ్యాపారులకు ఎగుమతి చేస్తున్నారు. అక్కడి నుంచి వారు అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించి మంచి ఆదాయం పొందుతున్నారు.

మార్కెటింగ్ కల్పించాలి

జాఫ్రాకు గిట్టుబాటు ధర లభించేలా మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. దళారులు తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారు. డిమాండ్ తగ్గ రేటు రైతులకు చెల్లిస్తే మరింతమంది రైతులు జాఫ్రా సాగు చేసేందుకు అవకాశం ఉంటుంది. అదేస్థాయిలో మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి.

–కదల మంగిరెడ్డి, కుందాడ, మారేడుమిల్లి మండలం

ఐటీడీఏ ప్రోత్సాహం

ఏజెన్సీలో జాఫ్రా పండించే రైతులను ప్రోత్సహించేందుకు రంపచోడవరం ఐటీడీఏ కృషి చేస్తోంది. ఈ ఏడాది జాఫ్రా రైతులకు బరకాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం. జాఫ్రా పండించే రైతులంతా ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి యూనిట్ విలువలో పది శాతం చెల్లిస్తే సోలార్ కోల్డ్ స్టోరేజ్ గొడౌన్లు నిర్మించుకోవచ్చు. ఆసక్తి గల రైతులు ముందుకు వస్తే అందుకు అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తాం.

–కె.చిట్టిబాబు, ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి, ఐటీడీఏ, రంపచోడవరం

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అవంతి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

మాకవరపాలెం: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అవంతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల విశాఖపట్నం కెమికల్ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా స్థాయి ఇంటర్ స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఈ పోటీల్లో మండలంలోని తామరంలో అవంతి కళాశాల నుంచి 27 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో బ్యాడ్మింటన్ పోటీల్లో చుక్కల ప్రసాద్, రాహుల్ ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. వీరు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ మోహన్‌రావు ఆదివారం తెలిపారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు ఏవో డానియల్‌రాజ్, ఫిజికల్ డైరెక్టర్లు అభినందించారు.

చెక్‌పోస్టుల ఏర్పాటుకు చర్యలు : ఏఎస్పీ



పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఏఎస్పీ

కోటవురట్ల: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మద్యం, డబ్బు అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన సందర్శించి, రికార్డులు పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఆక్సాహేబు పేట, విశ్వనాథపురం, లింగాపురం జంక్షన్లలో చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గంజాయి రవాణా జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఏఎస్పీ వెంట నక్కపల్లి సీఐ అప్పన్న, స్థానిక ఎస్ఐ నారాయణరావు ఉన్నారు.

'అమృత్ భారత్'.. వచ్చేసింది

- వాల్తేరు డివిజన్‌లోకి స్వాగతం పలికిన స్పీకర్ తమ్మినేని
- ఆధునిక వసతులతో ఆకట్టుకున్న సామాన్యుల ఎక్స్‌ప్రెస్



అమృత్ భారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

బీచ్ రోడ్డు: సామాన్యుల సూపర్‌ఫాస్ట్ రైలుగా చెప్పుకునే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ వాల్తేరు డివిజన్‌లో పట్టాలపై పరుగులు పెట్టింది. ఆదివారం 12.45 గంటలకు వాల్తేరు డివిజన్ ప్రాంతమైన శ్రీకాకుళం రోడ్డు జంక్షన్‌కు చేరిన ఈ రైలుకు అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎంపీ రామ్మోహన్ నాయుడు ఘన స్వాగతం పలికారు. భారత్‌లో సూపర్‌ఫాస్ట్ అంటే వందే భారత్ ఎక్స్‌ప్రెస్. అయితే ఈ రైలులో ప్రయాణం చాలా ఖరీదు. దీంతో సామాన్యులు ఈ రైలు ఎక్కేందుకు ఆసక్తి కనబరచడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని భారతీయ రైల్వే అదే స్పీడ్, అదే సౌకర్యాలను సామాన్య ప్రయాణికులకు అందించాలని అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ పేరుతో పట్టాలెక్కించింది. స్పీడ్‌లో గానీ, సౌకర్యాల్లో గానీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ రైలు ఏ మాత్రం తీసిపోదు. అయితే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఫుల్ ఏసీ బోగీలతో నడిస్తే అమృత్ ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీల బోగీలతో నడుస్తుంది. సులభంగా చెప్పాలంటే అత్యంత స్పీడ్‌తో అత్యాధునిక సౌకర్యాలతో నడిచే పాసింజర్ రైలే ఈ అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్. 22 బోగీలతో నడిచే ఈ రైళ్ల(రెండు రైళ్ల)ను ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించడం తెలిసిందే.

సౌకర్యాలు ఇవే..

వందే భారత్ రైలు మాదిరిగానే ఈ రైలు కూడా 130 కిలోమీటర్ల స్పీడ్‌తో నడుస్తుంది. అత్యాధునిక మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, మొబైల్స్ పెట్టుకునేందుకు ప్రత్యేకంగా చార్జింగ్ పాయింట్లు, వాటర్ బాటిళ్ల కోసం ఫోల్డబుల్ బాటిల్ హోల్డర్స్, మెరుగైన లగేజీ రాక్, ఎల్ఈడీ లైట్లు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం, ఎర్గోనామిక్‌గా డిజైన్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతి బోగీలో ఒక వెస్ట్రన్‌తో పాటు మూడు ఇండియన్ స్టైల్ టాయిలెట్స్, కాళ్లతో ఆపరేట్ చేసే వాటర్ ట్యాప్‌లు ఉన్నాయి. 1834 మంది పాసింజర్లను తీసుకొని వెళ్లగలిగే ఈ రైలు మొత్తం 22 బోగీలో నడుస్తుంది. 12 స్లీపర్ క్లాసులు, 2 రిజర్వ్‌డ్ స్లీపర్ క్లాసులు, 8 సాధారణ పాసింజర్ బోగీలు ఉన్నాయి.

కుదుపుల్లేని ప్రయాణం

అత్యధిక స్పీడ్‌తో నడిచే రైలు కావడంతో కుదుపులు లేకుండా ఉండేందుకు తొలిసారిగా పుష్ అండ్ పుల్ రాక్ విధానంలో బోగీలను రూపొందించారు. దీని వల్ల కుదుపులు లేకుండా రైలు ప్రయాణించడంతో పాటు బోగీలు తప్పిపోకుండా భద్రత కూడా ఉంటుంది. ఈ రైలు 13434 నంబరుతో వారానికి ఒక్క రోజు మాల్దా టౌన్ నుంచి బెంగళూరు ప్రయాణిస్తుంది. మాల్దా టౌన్‌లో ఉదయం 8.50 గంటలకు బయలుదేరి మరోసటి రోజు ఉదయం 3 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. మళ్లీ 13233 నంబరుతో బెంగళూరు నుంచి మధ్యాహ్నం 1.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు మాల్దా టౌన్ చేరుకుంటుంది. ఈ రైలు మన రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తుని, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్‌లలో ఆగుతుంది.



అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్

అడుగడుగునా ఘన స్వాగతం

మాల్దా టౌన్ నుంచి బయలుదేరి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆగిన ప్రతి స్టేషన్‌లో ఘన స్వాగతం లభించింది. స్కూల్, కాలేజీ విద్యార్థులు కరతాల ధ్వనులతో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తుని రైల్వే స్టేషన్లలో రైలుకు స్వాగతం చెప్పారు.



రైలులో తల్లిదండ్రులతో కలిసి ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

సామాన్యులకు వరం..



దూర ప్రయాణాలు చేసే సామాన్యులకు ఈ రైలు ఒక వరం అని చెప్పాలి. అతి తక్కువ ఖర్చుతో వేగంగా తమ గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం ఈ అమృత్ రైలు కలిగిస్తుంది. దీని వల్ల డబ్బుతో పాటు సమయం ఆదా అవుతుంది. సౌకర్యాలు చాలా బాగున్నాయి.

– ఆర్.లక్ష్మి, ప్రయాణికురాలు, అక్కయ్యపాలెం

భద్రత.. సౌకర్యాలు



నాన్ ఏసీ రైలు అయినా సీసీ టీవీలు ఉండడంతో ప్రయాణికులకు ఎంతో భద్రత ఉంటుంది. వందే భారత్ రైలులో ఉండే సౌకర్యాలన్నీ ఈ రైలులో ఉన్నాయి. టాయిలెట్స్ చాలా అధునాతనంగా ఉన్నాయి. బెర్త్‌లు, మొబైల్ చార్జింగ్ పాయింట్స్ ఎంతో సౌకర్యవంతం కానున్నాయి.

– వి.సిరిభువన, ప్రయాణికురాలు, విశాఖపట్నం

14న గోదాదేవి కల్యాణం



గోదాదేవి, వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి,భూదేవి ఉత్సవమూర్తులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన కొండదిగువ వేంటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 14న భోగి రోజు గోదా కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆదివారం తెలిపారు. ఆరోజు ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం నిర్వహిస్తామన్నారు. ఆదివారం నుంచి టికెట్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో టికెట్లు తీసుకునే భక్తులు టీటీటీ. aptemples.ap.gov.in ద్వారా తీసుకోవచ్చని తెలిపారు. అలాగే నేరుగా టికెట్లు తీసుకునే భక్తులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సంప్రదించాలని కోరారు. టికెట్టు రూ.1000లని తెలిపారు.

ఆన్‌లైన్‌లో స్వాతినక్షత్రం టికెట్లు

సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 6న స్వాతినక్షత్రం రోజున జరిగే శ్రీనృసింహ హోమంలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచినట్టు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. టీటీటీ.ఎపిటెంపుల్స్.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా టికెట్లు తీసుకోవచ్చని తెలిపారు. అలాగే నేరుగా వచ్చే భక్తులు సింహగిరిపై ఉన్న పీఆర్ఓ కార్యాలయంలో తీసుకోవచ్చని తెలిపారు.

దంపతులపై దాడి



దాడిలో గాయపడిన దంపతులు

యలమంచిలి రూరల్: వ్యక్తిగత దూషణలతో క్షణికావేశానికి గురైన ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు పొరుగునున్న దంపతులపై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన మండలంలోని పులపర్తిలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు,వైద్య సిబ్బంది తెలియజేసిన వివరాల ప్రకారం పులపర్తి బీసీ కాలనీ రైస్ మిల్లు పక్కన నివాసముంటున్న దంపతులు పెద్దాడ బేబీ,భర్త కల్యాణ్,సమీపంలో నివాసముంటున్న మరో కుటుంబానికి ఆదివారం ఉదయం స్వల్ప వివాదం ఏర్పడింది. తన ద్విచక్రవాహనం తాళాన్ని ఎవరో విరగ్గొట్టారంటూ బేబీ తిట్టుకుంటుండగా తమనే దూషిస్తున్నారనుకుని ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు కర్రలతో తమపై దాడి చేశారని బేబీ ఆరోపిస్తోంది. తన భర్తను కూడా ముగ్గురూ ఇష్టానుసారంగా కొట్టారని తెలిపింది. ఈ దాడిలో బేబీ కుడి చేయిపై తీవ్ర గాయమైంది. 15 కుట్లు వేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. ఆమె భర్త కల్యాణ్‌కు కూడా ప్రథమ చికిత్స అందజేశారు. అయితే ఆరోపణలెదుర్కొంటున్న కుటుంబం కూడా బేబీ, ఆమె భర్త తమపై దాడి చేశారని ఆరోపిస్తూ యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం వచ్చారు. ఇరు కుటుంబాల వారు యలమంచిలి రూరల్ పోలీసులను ఆశ్రయించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కశింకోట: మండల కేంద్రం కశింకోట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందినట్టు అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వెళ్లే రోడ్డులో నడిచి వెళుతున్న అనకాపల్లిలోని కోట్ని వీధికి చెందిన బత్తుల సత్యనారాయణ(73)ను శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, మేనకోడలు కొల్లేటి దేవి భవాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అయోధ్య అక్షింతలతో వైభవంగా శోభాయాత్ర



అయోధ్య శ్రీరాముని పూజిత అక్షింతలతో శోభాయాత్రలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



అక్షింతలను గ్రామాల ప్రజాప్రతినిధులకు అందజేస్తున్న కిలపర్తి భాస్కరరావు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

దేవరాపల్లి: అయోధ్య నుంచి అక్షింతలతో మండల కేంద్రం దేవరాపల్లిలో ఆదివారం వైభవంగా శోభాయాత్రను నిర్వహించారు. మహిళల కోలాటం మధ్య ఈ యాత్ర సాగింది. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డిప్యూటీ సీఎంను శ్రీరామ భక్తులు, ప్రజాప్రతినిధులు, అయోధ్య రామాలయ మండల కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి చేతులు మీదుగా ఈ అక్షింతలను మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలకు అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు అక్షింతలతో కూడిన కలశాన్ని తలపై పెట్టుకుని ప్రధాన రహదారి మీదుగా శోభాయాత్ర నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, మండల అధ్యక్షుడు బూరె బాబురావు, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, అయోధ్య రామాలయ మండల కమిటీ సభ్యులు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వి.సింహాచలం నాయుడు, ఆదిరెడ్డి చినకన్నబాబు, కె.వి.రమణ, భీమవరపు కోటేశ్వరరావు, కొరుపోలు శ్రీను, ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ స్వామినాయుడు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, పోతల శంకరరావు, సర్పంచ్‌లు సబ్బవరపు పెంటమ్మ, చింతల సత్య వెంకటరమణ, టోకురి రామకృష్ణ, ఎంపీటీసీలు మొల్లి కృష్ణమూర్తి, పోతల వెంకటరావు తదితర్లు పాల్గొన్నారు.

రన్నరప్‌గా ఏయూ టెన్నిస్ జట్టు

విశాఖ స్పోర్ట్స్: సౌత్‌జోన్ అంతర్ వర్సిటీల టెన్నిస్ పోటీల్లో ఏయూ మెన్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. కృష్ణా వర్సిటీ ఆధ్వర్యంలో విజయవాడ లయోలా కళాశాలలో ఈ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జట్టును ఏయూ ఇన్‌చార్జి వీసీ కె.సమత, రిజిస్ట్రార్ జేమ్స్ తదితరులు అభినందించారు.

ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి

- ఆర్ కొత్తూరులో ఘటన

కొయ్యూరు: ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి చెందాడు. ఎస్ఐ రాజారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆర్. కొత్తూరులో ఆదివారం కుసిరెడ్డి శ్రీను(40) ట్రాక్టర్‌తో వరి కుప్పను నూరుస్తున్నాడు. అదే సమయంలో అతను అదుపుతప్పి పడిపోయాడు. దీంతో ట్రాక్టర్ చక్రాలు అతనిపైకి ఎక్కడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శ్రీను మృతి చెందినట్టుగా వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య రాజేశ్వరి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



శ్రీను మృతదేహం

గంజాయి కేసులో మరొకరికి రిమాండ్

యలమంచిలి రూరల్: యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసులకు సంబంధించి భద్రపరిచిన గంజాయి చోరీకి పాల్పడిన కేసులో మరో నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈస్ట్ గంగవరానికి చెందిన ఉయ్యాల శ్రీనివాసరావును 9వ నిందితుడిగా ఈ కేసులో యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి నిందితుడు శ్రీనివాసరావుకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.ఈ మేరకు నిందితుడ్ని యలమంచిలి రూరల్ పోలీసులు విశాఖ కేంద్ర కారాగారానికి తరలించారు. ఇదే కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసి విశాఖ సెంట్రల్ ప్రిజన్‌కు రిమాండుకు, ఇద్దరు మైనర్లను జువెనైల్‌హోంకు ఇప్పటికే తరలించారు. యలమంచిలి పట్టణానికి చెందిన మరో నిందితుడు కార్తీక్ పరారీలో ఉన్నాడు.అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విశాఖ వాసుల సత్తా



శివరామకృష్ణను సత్కరిస్తున్న ప్రొఫెసర్ సుభాకర్‌రాజు

మురళీనగర్: ఇటీవల పాండిచ్చేరిలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్‌లో విశాఖ క్రీడాకారులు తమ సత్తా చాటారు. విశాఖ పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్‌నుంచి 19 విద్యార్థులు పాల్గొనగా వీరిలో 11మంది బంగారు, రజిత, కాంస్య పతకాలు సాధించారు. ఈ సంస్థ నుంచి పాల్గొన్న పోర్ట్ ట్రస్టు ఉద్యోగుల్లో జి.శివరామకృష్ణ ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. ఈ సందర్భంగా ఆయనను కేఎల్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ ఆర్.సుభాకర్ రాజు చేతులు మీదుగా ఆదివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఎస్ఆర్ మార్షల్ ఆర్ట్స్ గౌరవాధ్యక్షుడు ఎస్వీ రమణ, మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పి.నరసింహారావు, కోచ్ పరదేశి పాల్గొన్నారు.

యలమంచిలి ఎస్ఐకు కలెక్టర్,ఎస్పీ ప్రశంస

యలమంచిలి రూరల్: పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు గత ఏడాదిలో మెరుగైన పనితీరును కనబరిచినందుకు జిల్లా ఉన్నతాధికారులు ప్రశంసించారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ కె.వి. మురళీకృష్ణల నుంచి రెండు ప్రశంసాపత్రాలు అందుకున్నట్టు ఎస్ఐ పాపినాయుడు ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణలో సమర్థంగా పనిచేసి కేసులను తగ్గుముఖం పట్టేలా కృషి చేసినందుకు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేసేవారిపై ఎక్కువ కేసులు నమోదు చేసినందుకు రెండు అవార్డులు లభించినట్టు చెప్పారు. కలెక్టరు, ఎస్పీ ప్రశంసలందుకున్న ఎస్ఐని సీఐ షేక్ గఫూర్,యలమంచిలి పట్టణ,రూరల్ పోలీస్‌స్టేషన్ల సిబ్బంది అభినందించారు.

వినూత్న స్వాగతం





మాడుగుల రూరల్: మండలంలో ఎం.కోడూరు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు నెయ్యిదొండ గోపాల్ నూతన సంవత్సరానికి వినూత్నంగా స్వాగతం పలికారు.పెన్సిల్ ముల్లు మీద 2024 ఆకారాన్ని చెక్కి ప్రతిభ చాటుకున్నారు. దీనిని చెక్కేందుకు 3 గంటల సమయం పట్టిందని గోపాల్ ఆదివారం తెలిపారు. ఆయన ఎం.కోడూరు సచివాలయంలో గ్రామ వలంటీరుగా పనిచేస్తున్నారు.

7న వెంకటాద్రిపై సుదర్శన హోమం



స్వామీజీని ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న వెంకటాద్రి బృందం

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుప్పావై 15వ పాశురాన్ని వివరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7న వెంకటాద్రిపై సుదర్శన హోమం నిర్వహించనున్నారు. ఈ మేరకు శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని వెంకటాద్రి ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో బృందం కలిసి ఈ కార్యక్రమానికి ఆహ్వానించింది. స్వామీజీ ఆశీస్సులు తీసుకుని ఆహ్వానపత్రిక అందజేసింది. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం స్వామి నవనీత(వెన్న) అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కనులపండువగా నృత్యోత్సవం



నృత్యం చేస్తున్న కళాకారులు

మద్దిలపాలెం: నాట్య సన్నిధాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో నృత్యోత్సవం కనులపండువగా సాగింది. కూచిపూడి నాట్యగురువు సన్నిధా సాగిరాజు శిష్యులు ఆర్కెస్ట్రా సహకారంతో కడు రమ్యంగా నృత్యాలను ప్రదర్శించారు. గురు సన్నిధా సాగిరాజ్ నట్టువాంగం,గాత్రం చేయగా, డి.ఎస్.వి.శాస్త్రి మృదంగం, కె.రాజగోపాలాచారి ఫ్లూట్, వి.వి.ఎస్.మురళి వయోలిన్ సహకారంలో నృత్య ప్రదర్శన అద్భుతంగా సాగింది. ముందుగా ఈ కార్యక్రమాన్ని మీఎండీఏ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, సెయింట్ జోసెఫ్ కాలేజీ హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ హోం సైన్స్ వై.లక్ష్మీ ప్రభ, కూచిపూడి కళాక్షేత్రం ప్రిన్సిపాల్ హరిరామమూర్తి, కూచిపూడి నాట్య గురువు పార్వతీ రామచంద్రన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.